ప్రజల చేతిలో

www.ayudamdaily.com


ఆయుధం

The Common People's Voice

ఆదివారం | నవంబరు 01, 2026 | సంపుటి : 7 | సంచిక : 127 | పేజీలు : 2

సమైక్య భారత నిర్మాణంలో పటేల్ సేవలు అజరామరం

■ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నవీన్


2 లో

పేద యువతులే టార్గెట్

■ మహిళల అండాలు సేకరిస్తున్న ముఠా అరెస్ట్


ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంచి అండాల సేకరణ

హైదరాబాద్, ఆయుధం: డబ్బు ఆశ చూపించి పేద యువతులను ప్రలోభపెట్టి అక్రమంగా అండాలను సేకరిస్తున్న వ్యవహారం హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చింది. సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో ఈ వ్యవహారం బయటపడింది. వివిధ రాష్ట్రాలకు చెందిన యువతులను డబ్బు ఆశ చూపించి హైదరాబాద్‌కు రప్పించిన దుర్గా ప్రసాద్ అనే వ్యక్తి సరూర్‌నగర్‌లోని వెంకటేశ్వర కాలనీలో శెట్టి వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌ను ఏర్పాటు చేశాడు. ఈ హాస్టల్‌లో ఉంటున్న పేదరికంలో ఉన్న యువతులను ప్రలోభపెట్టి నెలనెలా అండాలను సేకరించాడు.


ఇలా యువతుల నుంచి సేకరించిన అండాలను వివిధ కార్పొరేట్ ఆసుపత్రులకు అధిక ధరలకు సరఫరా చేశాడు. యువతుల అండాలను ఫెర్టిలిటీ సెంటర్లకు అమ్ముతున్నాడు. ఈ వ్యవహారంపై పక్కా సమాచారం అందుకున్న సరూర్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టి దుర్గాప్రసాద్‌తో పాటు 8మందిని అరెస్టు చేశారు. హాస్టల్ నుంచి 15 మంది యువతులను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షల అనంతరం అక్కడి నుంచి రక్షణ గృహాలకు పంపించారు.

ముందుగా బేగంపేట ప్రకాష్‌నగర్‌లో ముఠాను పోలీసులు పట్టుకున్నారు. బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశాకు చెందిన 8నుంచి 10 మంది యువతులను ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంచి అండాలు సేకరిస్తున్నట్లు పోలీస్ అధికారులు గుర్తించారు. గతేడాది నుంచి యువతుల అండాలను సేకరించి సంతాన సాఫల్య కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్లు తేల్చారు. అమీ నీతా గర్ల్స్ హాస్టల్ పేరుతో ఈ దందా సాగిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఇక్కడ లభించిన సమాచారంతో ఇవాళ సరూర్ నగర్‌పరిధిలో దాడులు నిర్వహించి ముఠా సభ్యులను అరెస్ట్ చేశారు.

మహిళల అండాల విక్రయ ముఠా వివరాలను మల్కాజ్‌గిరి సీపీ సుమతి వెల్లడించారు. అక్రమంగా మహిళల అండాల సేకరణపై దర్యాప్తు చేస్తున్నామని, అండాల దందాలో ఇందౌర్ వాసి అమిత్‌శర్మ ప్రధాన నిందితుడు అని తెలిపారు.

ఇండీ కూటమి మాక్ పార్లమెంట్

■ సీఈసీపై అభిశంసన తీర్మానం



ఢిల్లీ, ఆయుధం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల కమిషన్‌ను నడుపుతున్నారని రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. దీనివల్ల దేశంలో సామాన్యుడి ఓటు హక్కు ప్రమాదంలో పడిందని ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని రద్దు చేయాలని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను నిలిపివేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. శనివారం దిల్లీలోని ఖర్గే అధికారిక నివాసంలో లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షతన ప్రతిపక్ష ఇండీ కూటమి 'మాక్ పార్లమెంట్' సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ 'బహిరంగ ప్రజా అభిశంసన' తీర్మానం ప్రవేశపెట్టింది. అనంతరం ఖర్గే మాట్లాడుతూ, సీఈసీ కుమార్‌పై 'ఆరోపణలను' సభలో చదివి వినిపించారు. జ్ఞానేశ్ కుమార్ దేశద్రోహానికి పాల్పడ్డారని ఖర్గే ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని రద్దు చేసి ఆయనను ఆ పదవిలో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సీఈసీని తొలగించాలని కోరుతూ ప్రతిపక్ష ఎంపీలు ఇప్పటికే పార్లమెంటు ఉభయ సభలలో ప్రతిపాదనలు ప్రవేశపెట్టారని, కానీ తమ నోటీసులను స్వీకరించలేదని ఖర్గే చెప్పారు. అందువల్లే ఈ సమావేశం నిర్వహించాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

'రాజ్యాంగ సంస్థ గౌరవాన్ని కాపాడటానికే ఈరోజు ఈ ప్రతిపాదనను తీసుకువచ్చాం. సీఈసీపై మాకు ఎలాంటి వ్యక్తిగత విద్వేషం లేదు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా పనిచేయాలని మేం కోరుకుంటున్నాం. 2014 నుంచి అధికారంలో కొనసాగేందుకు మోదీ ప్రభుత్వం అన్ని కుట్రలు చేస్తోంది. 2023 చట్టం కల్పిస్తున్న రక్షణ కారణంగానే సీఈసీ ఓటు చోరీకి పాల్పడుతున్నారు. సర్ ప్రక్రియ ద్వారా దేశంలో ఉద్దేశపూర్వకంగానే 14 కోట్ల మంది ఓట్లను తొలగించారు. ఈ చట్టం ఆయనకు అన్ని విధాల చర్యల నుంచి రక్షణ కల్పిస్తోంది. 145 మంది ప్రతిపక్ష ఎంపీలను పార్లమెంటు నుంచి సస్పెండ్ చేసి, వారిని సభా కార్యకలాపాలలో పాల్గొనకుండా నిరోధించిన తర్వాత ఈ చట్టాన్ని ఆమోదించారు. అందుకే దీన్ని వెంటనే రద్దు చేయాలి. సర్ ప్రక్రియను నిలిపివేసి అక్రమంగా తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి. దేశంలో ఎన్నికలు ఏవైనా సరే వాటిని బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలి. ఇవే ఇండీ కూటమి ప్రధాన డిమాండ్లు' అని ఖర్గే అన్నారు. లోక్‌సభను పోలి ఉన్నట్లుగా ఈ మాక్ పార్లమెంట్ వేదికను ఏర్పాటు చేశారు.



శక్తి స్థల్ వద్ద నివాళి

భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న శ్రీమతి ఇందిరా గాంధీ గారి వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ సమాధి 'శక్తి స్థల్' వద్ద పుష్పాంజలి ఘటించారు.

– ఢిల్లీ, ఆయుధం




నీటిని పొదుపుగా వాడాలి

■ తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమివ్వాలి
■ యాసంగి సాగుకు ముందు నీటి లభ్యతపై అధికారులను సంప్రదించాలి
■ జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

కాంగ్రెస్ సర్కార్‌కు పట్టభద్రులు గుణపాఠం చెప్పాలి

■ మూడేళ్ల పాలనలో తెలంగాణను సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్..
■ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలేసింది
■ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



పరకాల, ఆయుధం: తెలంగాణలో త్వరలో జరగనున్న వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు అద్దం పట్టే ఎన్నికలని, మూడేళ్ల కాంగ్రెస్ పాలనకు పట్టభద్రులు తమ ఓటుతో గట్టిగా బుద్ధి చెప్పాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పరకాల మండలం నాగారం గ్రామంలో, పరకాల పట్టణంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై వేర్వేరుగా నిర్వహించిన సమీక్షా సమావేశాల్లో పార్టీ ఇంచార్జి సాంబారి సమ్మారావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాలు, వార్డుల వారీగా ఓటరు నమోదు పురోగతిని సమీక్షించి, నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను నాయకులు, కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. ఆరేళ్లకోసారి వచ్చే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తించి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఎన్నికల ముందు 420 హామీలు, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు ఒక్కో హామీకి ఒక్కో సాకు చెబుతూ ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. సాగునీరు అందించలేని చేతగానితనానికి ఎల్‌నినోను సాకుగా చూపించడం సిగ్గుచేటు. ప్రకృతి వైపరీత్యాలను సైతం రాజకీయ సాకులుగా మార్చుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలించే చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఒకవైపు ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతుంటే, తెలంగాణ ప్రాజెక్టులు నీరు లేక వెలవెలబోతున్నాయని, కాలువలు ఎండిపోయి రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం, దేవాదుల వంటి సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రైతులకు నీరందించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో పచ్చగా కళకళలాడిన తెలంగాణ.. నేడు కాంగ్రెస్ పాలనలో కరువు కాటకాలతో అల్లాడుతోంది. రైతులకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం వారిని ఆందోళనలోకి నెట్టిందని అన్నారు. తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిన బీఆర్ఎస్ పాలనకు, హామీలు అమలు చేయలేని కాంగ్రెస్ పాలనకు మధ్య ఉన్న తేడాను పట్టభద్రులు స్పష్టంగా గమనించాలని సూచించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొంటున్న రాజకీయ పరాజయాలే ఆ పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమని, తెలంగాణలోనూ కాంగ్రెస్ పతనం ప్రారంభమైందని అన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డిని గెలిపించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టభద్రులు తమ నిరసనను తెలియజేయాలని పిలుపునిచ్చారు. రాకేష్ రెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు.

సాంబారి సమ్మారావు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని సూచించారు. గ్రామాలు, వార్డుల వారీగా పట్టభద్రులను గుర్తించి, గతంలో ఓటరుగా నమోదైన వారు సైతం తాజా నిబంధనల ప్రకారం తిరిగి నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు పాల్గొన్నారు.

ఏకత్వానికి ప్రతిరూపమే జాతీయ ఐక్యతా దినోత్సవం

■ హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ, ఆయుధం: దేశ ప్రజలందరి ఏకత్వానికి ప్రతిరూపమే జాతీయ ఐక్యతా దినోత్సవం అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో దేశ తొలి ఉప ప్రధానమంత్రి, భారత దేశ ఉక్కుమనిషి, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి, అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు.





మిషన్ వాత్సల్యకు అర్హుల జాబితా సిద్ధం

■ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



హనుమకొండ, ఆయుధం: మిషన్ వాత్సల్య పథకానికి అర్హులైన వారి జాబితాను సిద్ధం చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మిషన్ వాత్సల్య పథకం అర్హుల ఎంపిక పై జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో రెండు పండల పదహారు మంది లబ్దిదారులను ఎంపిక చేసినట్లు తెలియజేశారు. జిల్లాలో మిషన్ వాత్సల్య పథకానికి 7 కేటగిరీలలో ఎంపికచేసామని.. ఎంపిక ప్రక్రియ గ్రామ స్థాయిలో అంగన్వాడి టీచర్లు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, ప్రాజెక్ట్ స్థాయిలో ఐసిడిఎస్ సిడిపివొ లు సూక్ష్మ పరిశీలన, సామాజిక దర్యాప్తు నివేదిక అనంతరం నివేదికను, సంబంధిత అర్హులను బాలల సంక్షేమ సమితి ముందు ప్రవేశ పెట్టి, జిల్లా స్థాయి స్పాన్సర్షిప్ కమిటీ ఆమోదించగా అర్హులను ఎంపిక చేశామని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మిషన్ వాత్సల్య పథకానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారిని గుర్తించి ఈ పథకానికి ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎంపిక చేసిన జాబితాలో తల్లి తండ్రులు లేని బాలబాలికలకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న తల్లిదండ్రులు, తల్లి లేదా తండ్రి ఇరువురు వదిలేయగా సంరక్షకుల వద్ద ఆశ్రయం పొందుతున్న వారికి, వితంతు మహిళలు, రక్షణ సంరక్షణ విద్యా వైద్య పోషకాహార అవసరతలు ఉన్న 28 మంది బాల బాలికలను 202627 సంవత్సరానికి గుర్తించి అర్హులుగా ఎంపిక చేయడం జరిగిందని, మొత్తం 216 మంది లబ్ధిదారులకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం విశ్వజ, బాలల సంక్షేమ సమితి సభ్యుడు డాక్టర్ పరికి సుధాకర్, సీడీపీఓలు, వి.సింధు రాణి, బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సిహెచ్. అవంతి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఇంచార్జి ఆఫీసర్ ఎస్ ప్రవీణ్ కుమార్, ఎఫ్ఎంఎంఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎర్ర శ్రీకాంత్, శిశు గృహ మేనేజర్ ఆరే శిరీష, ఐసీడీఎస్ సూపర్వైజర్లు ఝాన్సీ, సునీత, కల్పన, రాణి, సోషల్ వర్కర్లు ఎం.శ్రీనివాసులు, జి.సునీత, ఎస్.చైతన్య, ఓఆర్డబ్ల్యూ పి.విజయ్ కుమార్, సుజాత, తదితర అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ లోకాయుక్త జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి ని కలిసిన కలెక్టర్

హనుమకొండ, ఆయుధం: తెలంగాణ రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ ఏ. రాజశేఖర్ రెడ్డి శనివారం హనుమకొండ జిల్లాకి విచ్చేసిన సందర్భంగా స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు.



వీడియో జర్నలిస్టు జోసఫ్ తంబి కుటుంబానికి పరామర్శ

వరంగల్, ఆయుధం: హైదరాబాద్‌కు చెందిన TVJA సభ్యుడు, TV9 వీడియో జర్నలిస్టు పూదోట జోసఫ్ తంబి మృతి పట్ల వీడియో జర్నలిస్టులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో TVJA తరఫున వరంగల్ జిల్లా చెన్నారావుపేట గ్రామానికి వెళ్లి జోసఫ్ తంబి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేసి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జర్నలిస్టు కుటుంబానికి కష్టకాలంలో అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వృత్తి పరమైన అనుబంధం మాత్రమే కాకుండా మానవీయ సంబంధాలకు కూడా జర్నలిస్టులు ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కోశాధికారి సీనియర్ వీడియో జర్నలిస్టు అమర్, TV9 వరంగల్ జిల్లా బ్యూరో చీఫ్ పెద్దిష్, సీనియర్ వీడియో జర్నలిస్టులు సెంసాని మోహన్, గొర్రె సంజీవ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను కొనసాగిద్దాం

■ ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్

2 లో

వరంగల్ జిల్లా లేబర్ సెల్ కన్వీనర్ గా అల్లి అజయ్ బాబు



వరంగల్, ఆయుధం: వరంగల్ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు గంటా రవి కుమార్ కాశిబుగ్గ 19వ డివిజన్ చెందిన అల్లి అజయ్ బాబును వరంగల్ జిల్లా లేబర్ సెల్ కన్వీనర్ గా నియమించారు. అల్లి అజయ్ బాబు మాట్లాడుతూ వరంగల్ జిల్లా లేబర్ సెల్ కన్వీనర్ గా నన్ను నియమించినందుకు భారతీయ జనతా పార్టీకి సేవలు అందిస్తానని తెలిపారు. తనకు పదవి రావడానికి సహకరించిన వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, కుసుమ సతీష్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, వన్నాల వెంకటరమణ, రాష్ట్ర నాయకులకు, జిల్లా నాయకులకు, మండల నాయకులకు, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



భీమారంలోని పోలీస్ క్వార్టర్స్‌కు మహిళా పోలీస్ స్టేషన్ తరలింపు

హనుమకొండ, ఆయుధం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు హనుమకొండలోని సుబేదారి పోలీస్ స్టేషన్ పై అంతస్తులో నిర్వహించబడుతున్న హనుమకొండ మహిళా పోలీస్ స్టేషన్ ను భీమారం లోని కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న పోలీస్ క్వార్టర్స్ భవనానికి మార్చారు. వరంగల్ సిపి N. శ్వేత , ఐపీఎస్ మహిళలకు, ఫిర్యాదుదారులకు పోలీస్ సేవలు మరింత సులభంగా అందుబాటులో ఉండేలా ఈ చర్య తీసుకున్నారు , సుబేదారి పోలీస్ స్టేషన్ లో మహిళా పోలీస్ స్టేషన్ ను నిర్వహించడానికి సరిపోవడం లేదు, అలాగే ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ ను ఏర్పాటు చేయడానికి స్థలం సరిపోవడం లేక పోవడం వల్ల, ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది, విశాలమైన ప్రాంగణం లో మహిళా పోలీస్ స్టేషన్ ను మరియు సర్వోదయ NGO ఆధ్వర్యం లో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ ను కూడా ఏర్పాటు చేయడం జరిగింది. నవంబర్ 1వ తేదీ నుంచి హనుమకొండ మహిళా పోలీస్ స్టేషన్ నూతన ప్రాంగణం నుంచి ప్రజలకు సేవలు అందిస్తుంది. ప్రజలు ఈ మార్పును గమనించి, నవంబర్ 1వ తేదీ నుంచి భీమారంలోని కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న పోలీస్ క్వార్టర్స్ భవనంలో హనుమకొండ మహిళా పోలీస్ స్టేషన్ సేవలను పొందగలరు.



రాష్ట్రీయ ఏక్తా విలాస్ 2026

- **ప్రత్యేక స్వచ్ఛతా కార్యక్రమం – 6.0లో భాగంగా ఎఫ్‌సీఐ వరంగల్ డివిజన్‌లో పరిశుభ్రతా**

వరంగల్, ఆయుధం: ఎఫ్‌సిఐ ఉద్యోగులు సిబ్బందితో కలిసి 2026 స్వచ్ఛత 0.6 కార్యక్రమంలో భాగంగా ప్లేడ్జ్ నిర్వహించిన తర్వాత స్వేచ్ఛాత ర్యాలీ నిర్వహించారు. భారత ఆహార సంస్థ (FCI), వరంగల్ డివిజనల్ కార్యాలయం ఆధ్వర్యంలో ప్రత్యేక స్వచ్ఛతా కార్యక్రమం - 6.0 లో భాగంగా ఒకరోజు ప్రత్యేక పరిశుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎఫ్ సి ఐ మేనేజర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఎఫ్ సిఐ వరంగల్ డివిజనల్ మేనేజర్ నేత్ర ప్రకాశ్ హాజరైనారు. ఈ సందర్భంగా డివిజనల్ మేనేజర్ నేత్ర ప్రకాశ్ మాట్లాడుతూ.. వరంగల్ కాజీపేటలోని ఎఫ్ సి ఐ ఆఫీస్ కార్యాలయంతో పాటు గోదాములు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచాలనే లక్ష్యంతో వివిధ శుభ్రతా కార్యక్రమాలను చేపట్టినట్లుగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎఫ్‌సీఐ ఎఫ్‌ఎస్‌డీ కాజీపేటలోని ధాన్యం నిల్వ గోదాములలో** సిబ్బంది సహకారంతో గోదాముల మధ్యనున్న నడక మార్గాలను శుభ్రపరిచారు. నేలపై చెల్లాచెదురుగా ఉన్న ధాన్య అవశేషాలను తొలగించి, గోదాములలో పరిశుభ్రత, మెరుగైన నిర్వహణకు ప్రాధాన్యతా ఇవ్వడం జరిగిందని అన్నారు. అదేవిధంగా, కార్మికుల షెడ్ పరిసరాలు, వాహనాల పార్కింగ్ ప్రాంతం, కార్యాలయానికి వెళ్లే రహదారి, ఇతర బహిరంగ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్త, ఎండిన ఆకులు, అనవసరమైన మొక్కలు ఇతర వ్యర్థాలను తొలగిస్తూ శుభ్రతా కార్యక్రమాలు నిర్వహించినట్లుగా ఆయన తెలిపారు. అలాగే కార్యాలయ ప్రాంగణంలోని మరుగుదొడ్లను శుభ్రపరచి, పరిశుభ్రతను మెరుగుపరిచే చర్యలు చేపట్టారు. పరిసరాలను పచ్చదనంతో నింపే ఉద్దేశంతో కార్యాలయ ప్రాంగణంలోని కుండీలలో పెంచుతున్న మొక్కలకు నీరు పోసి, వాటి నిర్వహణపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించారు. ప్రత్యేక స్వచ్ఛతా కార్యక్రమం - 6.0 ద్వారా పరిశుభ్రతను కేవలం ఒకరోజు కార్యక్రమంగా కాకుండా, ప్రతిరోజూ పాటించాల్సిన బాధ్యతగా ప్రోత్సహించడం, ఉద్యోగులకు సందర్శకులకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యాలం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ సి ఐ ఎజిఎం ఇందు, మేనేజర్లు రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ప్రశాంత్, ప్రసన్న, ఇమ్రాన్, శ్రీధర్, మోహన్ కృష్ణ, సతీష్, భాస్కర్ రావు, వెంకట్ నారాయణ, ఎఫ్ సి ఐ ఉద్యోగులు సిబ్బందితో పాల్గొన్నారు.




ఉద్యోగ విరమణ పొందిన కుమారస్వామికి సన్మానం

వరంగల్, ఆయుధం: వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గాడెపల్లిలో శనివారం స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) ఉద్యోగ విరమణ పొందుతున్న చిగిరి ఉషారాణి కుమారస్వామి కి సన్మానం చేశారు. జెడ్పి హెచ్ఎస్ గాడేపల్లి హెడ్మాస్టర్ టి.వెంకన్న, టి.ప్రవీణ్ కుమార్, జి.పాపిరెడ్డి, వై.కృష్ణవేణి, జి.వినోద, ఏం.సరళ, వి.కవిత, సిహెచ్. ఎస్ సుదర్శన్, ఉపాధ్యాయులందరూ కలిసి చిగిరి ఉషారాణి కుమారస్వామి ఘనంగా సన్మానించారు. అనంతరం ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు టి వెంకన్న మాట్లాడుతూ కుమారస్వామి విద్యా బోధనతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొన్నందుకు అభినందనలు తెలియజేశారు. వారు పదవి విరమణ తర్వాత మంచి ఆరోగ్యాన్ని అష్టైశ్వర్యాలను ప్రసాదించాలని ఆ భగవంతున్ని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మిత్ర పరపతి సంఘం కమిటీ సభ్యులు, జనతా పరపతి సంఘం కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ సంక్షేమ పరపతి సంఘం కమిటీ సభ్యులు, చిగిరి భరత్ కుమార్, మధుమిత, వచన్ కుమార్, చిగిరి సాహ్రూట్, మానస, శణ్ముఖి. రాగుల మనీష, రాగుల శ్రీనివాస్, కార్తికేయ మల్లేష్, విశ్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమైక్య భారత నిర్మాణంలో పటేల్ సేవలు అజరామరం

- **కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నవీన్**



హనుమకొండ, ఆయుధం: స్వతంత్ర భారత నిర్మాణానికి సమర్థమైన పరిపాలన దక్షతను, వాస్తవిక దృక్పథాన్ని ప్రదర్శించ కలిగిన నాయకుడు, సమైక్య భారత నిర్మాణంలో ఆయన చూపిన రాజ నీతిజ్ఞత భారతీయులకు నిరంతర ప్రేరణ ఇవ్వగలధని, ఆధునిక భారతదేశ చరిత్రలో మహాత్మా గాంధీ ఆదర్శ ప్రధాతగా, నెహ్రూ భావుకుడిగా, సర్దార్ వల్లభాయ్ పటేల్ కార్యాచరణ దక్షుడిగా నిలిచారని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. శనివారం హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని డాక్టర్ అంపశయ్య నవీన్ గ్రంథాలయంలో భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంస్థ అధినేత డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని, ఏక్తా దివస్ ను పురస్కరించుకొని రాష్ట్రీయ ఏక్తా అభియాన్ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ నేతృత్వంలో ప్రచురించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ ఏకత అభియాన్ కన్వీనర్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్, మహాత్మా గాంధీ ఆశయానికి ఒక కార్యాచరణ విధానాన్ని రూపొందించడమే కాక, మధ్యయుగాల మనస్తత్వంతో మనుగడ సాగించు సంస్థానాధిపతులలో దేశభక్తిని ప్రబోధించి సమైక్య భారత రాజ్య నిర్మాణం చేసి ఆధునిక భారత చరిత్రలో చిరు యశస్సు గడించారనీ. శతాబ్దాలుగా అర్థ బానిసత్వంలో నిరంకుశత్వం కింద మగ్గుతున్న 544 సంస్థానాల ప్రజలను స్వతంత్ర భారత్ లో విలీనం చేయడం ద్వారా వారికి విముక్తిని ప్రసాదించడం పటేల్ జీవితానికి మణికిరీటం అని, మహాభారత కాలంలో శ్రీకృష్ణుని వలె సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర పోరాట కాలంలో కాంగ్రెస్ సంస్థ క్రమశిక్షణకు, స్వాతంత్ర్యనంతర సమైక్య భారత నిర్మాణానికి ఎదురు నిలిచిన వారిని ఓడించడంలో రాజకీయ రంగం నుండి నిష్క్రమింప చేయడంలో గొప్ప రాజనీతిని అనుసరించినాడని అన్నారు. ఈ కార్యక్రమంలో దొంగరి శశికిరణ్, ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ లతో పాటు సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి



వరంగల్, ఆయుధం: వరంగల్ తూర్పు నియోజకవర్గం గిర్మాజీపేటలోని గోవిందరాజుల గుట్ట దగ్గర మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి నిర్వహించారు. ఆమె విగ్రహానికి వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ స్వర్గీయ ఇందిరాగాంధీ రాజ బారణాలు రద్దుచేసి బ్యాంకులను జాతీయం చేసి పేద మధ్య తరగతి కుటుంబాలకు బాసటగా నిలిచిందని అన్నారు. హరిజన గిరిజన బడుగు బలహీన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఇందిరా గాంధీ గారికి దక్కుతుందని అన్నారు భారతదేశ ప్రధానమంత్రిగా అలిన దేశాల అధ్యక్షురాలుగా పనిచేసిన గొప్ప ఉక్కు మహిళగా పేరు పొందారని అన్నారు స్వర్గీయ ఇందిరా గాంధీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు పోలెపాక విశాల్ బాబు, సందెల లాజర్, మంద శ్రీనివాస్, సిలివేరు సాంబయ్య, మజ్జిగ తిరుమల్, 27వడివిజన్ కాంగ్రెస్ నాయకులు బూర మహేందర్, బల్ల సదానందం, పోలెపాక యాకూబ్, కంచర్ల వేణు, గూడ నవీన్, పోలెపాక సన్నీ, తైమూర్, కోగిల యాకూబ్, గద్దల అజయ్, గద్దల కార్తీక్, మంచాల పున్నంచందర్, చిన్న పెళ్లి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను కొనసాగిద్దాం

- **ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్**

నడికుడ, ఆయుధం: భారత లోహపు మనిషి, దేశ ప్రథమ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నడికుడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం "జాతీయ ఐక్యత దినోత్సవం" ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముందుగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని ఏకం చేయడంలో పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని, విద్యార్థులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సమగ్రతలను కాపాడటంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులలో ఐక్యత భావాన్ని పెంపొందించేలా విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి గ్రామంలో ఉత్సాహంగా ఐక్యత దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి నినాదాలతో గ్రామం మార్మోగింది. ర్యాలీ అనంతరం పాఠశాల ప్రాంగణంలో దేశ ఐక్యతను కాపాడుతామని అందరిచేతా జాతీయ ఐక్యత దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లకావత్ దేవా కంచ రాజ్ కుమార్ పుల్లూరి రామకృష్ణ ప్రీ ప్రైమరీ టీచర్ బండి శ్వేత విద్యార్థులు సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఇక సులభతరంగా మట్టి అనుమతులు

- **సమీకృత గ్రావెల్ నిర్వహణ విధానం అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు**
- **హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**




హనుమకొండ, ఆయుధం: చిన్న నిర్మాణ, ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన గ్రావెల్ (మట్టి)ని చట్టబద్ధంగా తీసుకెళ్లడానికి సులభతరమైన ఆన్‌లైన్ అనుమతుల విధానాన్ని జిల్లాలో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో నూతనంగా అమలులోకి తీసుకురానున్న సమీకృత గ్రావెల్ నిర్వహణ విధానంపై తహసీల్దార్లు, సాగునీటిపారుదల శాఖ అధికారులు, ఆర్ఐలు, పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) సహకారంతో సమీకృత గ్రావెల్ నిర్వహణ విధానం (ఇంటిగ్రేటెడ్ గ్రావెల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) ఆన్ లైన్ పోర్టల్ ను రూపొందించినట్లు తెలిపారు. ఈ నూతన విధానం అమలుకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలన అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గ్రావెల్ (మట్టి) అవసరమైన వారు అనుమతులు పొందడంలో ఇబ్బందులు, ఇతర సమస్యలకు పరిష్కారంగా రూపొందించిన నూతన ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా చిన్న పరిమాణంలో గ్రావెల్ (మట్టి) అవసరమైన వారు కూడా సరళమైన విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. దరఖాస్తులను రెవెన్యూ అధికారులు పరిశీలించి, సంబంధిత భూముల వివరాలను ధ్రువీకరించిన అనంతరం అనుమతులు మంజూరు చేస్తారని తెలిపారు. పట్టా భూముల నుంచి కూడా నిబంధనల ప్రకారం గ్రావెల్ (మట్టిని) తీసుకెళ్లేందుకు ఈ విధానంలో అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా గతంలో సాగునీటి కాలువల నిర్మాణ సమయంలో నిల్వ చేసిన గ్రావెల్‌ను తొలుత వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ నిల్వలను తొలగించడం ద్వారా విలువైన ప్రభుత్వ భూమిని తిరిగి వినియోగంలోకి తీసుకురావచ్చని, ఆ భూములను భవిష్యత్తులో ప్రభుత్వ సంస్థలు, ప్రజా ప్రయోజన కార్యక్రమాలకు ఉపయోగించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. చెరువులు, ఇరిగేషన్ శాఖకు సంబంధించిన ప్రాంతాల నుంచి గ్రావెల్ (మట్టి) తరలింపునకు దరఖాస్తులు వచ్చినప్పుడు రెవెన్యూ అధికారులు వాటిని ఇరిగేషన్ శాఖకు పంపించి సంబంధిత అధికారుల అభిప్రాయాలు, సిఫార్సులు తీసుకునే వెసులుబాటు కూడా ఈ పోర్టల్‌లో కల్పించినట్లు తెలిపారు. అనుమతులు మంజూరైన అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది కీలక పాత్ర పోషించాలని సూచించారు. అనుమతి పొందిన వ్యక్తులు ఎన్ని వాహనాల ద్వారా, ఎన్ని ట్రిప్పుల్లో, ఎంత పరిమాణంలో గ్రావెల్ తరలిస్తున్నారనే వివరాలను గ్రామస్థాయిలో నమోదు చేసి పర్యవేక్షించాలని తెలిపారు. ఇందుకోసం గ్రామపంచాయతీల్లో అందుబాటులో ఉన్న సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ విధానం ద్వారా అక్రమ గ్రావెల్ (మట్టి)తవ్వకాలు, రవాణాకు అడ్డుకట్ట వేయడంతో పాటు, అనుమతుల ప్రక్రియలో పారదర్శకత లభిస్తుందన్నారు. తద్వారా గ్రామపంచాయతీలకు కూడా ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఈ విధానం ద్వారా గ్రావెల్ (మట్టి)అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడడం, అక్రమ మైనింగ్‌ను నియంత్రించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ విధానాన్ని త్వరగా అమల్లోకి తీసుకురావాలని ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

నీటిని పొదుపుగా వినియోగించాలి

- **తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమివ్వాలి**
- **యాసంగి సాగుకు ముందు నీటి లభ్యతపై అధికారులను సంప్రదించాలి**
- **జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



ములుగు, ఆయుధం: ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో అందుబాటులో ఉన్న జలవనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ప్రజలకు సూచించారు. రానున్న వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి నీటి చుక్కను పొదుపు చేయాలని కోరారు. జిల్లాలో వానాకాలం పంటలకు రామప్ప సరస్సు ద్వారా 5,180 ఎకరాలు, లక్నవరం సరస్సు ద్వారా 4,500 ఎకరాలు, పాలెంవాగు ప్రాజెక్టు ద్వారా 7,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించినట్లు తెలిపారు. కన్నాయిగూడెం మండలం గంగారం గ్రామంలోని దేవాదుల పంపుహౌస్ ద్వారా జూలై 2026 నుంచి ఇప్పటివరకు సుమారు 16.50 టీఎంసీల నీటిని ఎత్తిపోసి, ఎత్తైన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు మళ్లించినట్లు పేర్కొన్నారు. ఇకపై నీటి ఎత్తిపోతలు గోదావరిలో నీటి లభ్యతపై ఆధారపడి ఉంటాయని వివరించారు. ప్రాజెక్టు కట్టల పటిష్టత, కాలువల నిర్వహణ, తూముల మరమ్మతులను నీటిపారుదల శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. సరఫరా చేస్తున్న నీరు ఆయకట్టు చివరి భూములకు చేరేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.
యాసంగి సాగుపై రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.
ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున యాసంగి పంటలకు సాగునీరు విడుదల చేయడం కష్టతరంగా మారిందని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని పేర్కొన్నారు. రైతులు ఈ పరిస్థితిని అర్థం చేసుకొని సహకరించాలని కోరారు. యాసంగి సాగుకు సన్నద్ధమయ్యే ముందు నీటిపారుదల శాఖ అధికారులను సంప్రదించి, నీటి లభ్యత, విడుదల వివరాలను తెలుసుకోవాలని సూచించారు. దేవాదుల పంపుహౌస్‌ల నిర్వహణను పర్యవేక్షిస్తూ, గోదావరిలో నీటి లభ్యతకు అనుగుణంగా జలాశయాలు, చెరువులను నింపేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రానున్న వేసవిలో ఎత్తైన ప్రాంతాల్లో నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని కోరారు. పైపులైన్లలో లీకేజీలను గుర్తిస్తే సంబంధిత అధికారులకు తెలియజేయాలని, నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

- **బల్దియా కమిషనర్ వెంకన్న**
- **వెంకట్రామ జంక్షన్ నుండి చింతల్ ఫై ఓవర్ వరకు రోడ్డు పరిశీలన**

వరంగల్, ఆయుధం: వరంగల్ నగరంలో రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ టి. వెంకన్న, సిటీ ప్లానర్ రవీందర్ రెడ్డితో కలిసి వెంకట్రామ జంక్షన్ నుంచి చింతల్ ఫ్లైఓవర్ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణకు సంబంధించిన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్డు విస్తరణకు ఆటంకంగా ఉన్న తాత్కాలిక ఆక్రమణలను తొలగించాలని అధికారులకు సూచించారు. రహదారి విస్తరణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలని ఆదేశించారు. సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసీపీ ఖలీలుద్దీన్, ఈ ఈ సంజయ్ కుమార్, డిఈ సురేష్ బాబు, టీపీఓ అభినాష్, తదితరులు పాల్గొన్నారు.



కేహబ్ నిర్మాణ పనుల పరిశీలన

హనుమకొండ, ఆయుధం: కాకతీయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న కేహబ్ పనులను శనివారం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పరిశీలించారు. మూడు అంతస్తుల్లో కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించి, పనుల పురోగతి, ప్రస్తుత జరుగుతున్న పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేహబ్‌ను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చేలా నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డివిజినల్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, ఇతర అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కె హాబ్ నోడల్ అధికారి ఆచార్య ఆర్.మల్లికార్జున రెడ్డి, విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



పద్మశాలీల ఐక్యతే ప్రగతికి పునాది



జనగామ, ఆయుధం: హైదరాబాద్‌లో నవంబర్ 1న నిర్వహించనున్న పద్మశాలి దసరా మేళాను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా ఇన్‌చార్జి చింతకింది కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. శనివారం రఘునాథపల్లిలో ఆయన మాట్లాడుతూ పద్మశాలీలు రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న రోజుల్లో పద్మశాలి సామాజిక వర్గం రాజకీయ రంగంలో తన ప్రాతినిధ్యాన్ని పెంచుకోవాలని ఆకాంక్షించారు. రాబోయే ఎన్నికల్లో పద్మశాలీలు తమ ఐక్యతను చాటుతూ రాజకీయంగా చైతన్యవంతం కావాలని పేర్కొన్నారు. మన పూర్వీకులు అందించిన చేనేత వృత్తి కేవలం జీవనోపాధి మాత్రమే కాదని అది మన సంస్కృతికి గౌరవానికి ప్రతీక అని అన్నారు. మగ్గం నేసే ప్రతి కార్మికుడి సమస్య మనందరి సమస్యగా భావించాలన్నారు. చేనేత కార్మికుల హక్కులు సంక్షేమం ఉపాధి భద్రత కోసం కుల బంధువులంతా ఒకే వేదికపైకి రావాలని సూచించారు. వ్యక్తిగత విభేదాలు పక్కనపెట్టి వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఒక్కరి కష్టం అందరి కష్టంగా ఒక్కరి విజయం అందరి విజయంగా భావించినప్పుడే నిజమైన ఐక్యత సాధ్యమవుతుందని తెలిపారు. పద్మశాలీలలో రాజకీయ చైతన్యంతో పాటు విద్యా ఆర్థిక సామాజిక చైతన్యం కూడా పెరగాలని ఆకాంక్షించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే దసరా మేళా సామాజిక ఐక్యతకు పరస్పర పరిచయాలకు అభిప్రాయాల మార్పిడికి వేదికగా నిలవాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి పద్మశాలి కుల బంధువులు చేనేత కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొనాలని చింతకింది కృష్ణమూర్తి కోరారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695